
# నైఫ్ బేలన్స్ ఫీట్



ఒమ్మి రమేష్‌బాబు

నైఫ్ బేలన్స్ ఫీట్.

కత్తిమీద సాము.

గ్రేట్ రేమండ్ సర్కస్ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చే విన్యాసం అది.

అప్పటిదాకా జనాన్ని కడుపుబ్బా నవ్వించిన బఫూన్లు కూడా నిశ్శబ్దమై పోయారు.

ఎరీనా మధ్యలో నిలువెత్తు వేదిక. అదే, నైఫ్ బేలన్స్ ఫీట్ వేదిక.

సర్కస్‌లో అందరూ ఆ వేదికకి పెట్టిన ముద్దుపేరు- మృత్యువేదిక.

ఆరున్నర అడుగుల యెత్తు, నాలుగడుగుల వెడల్పు వున్న ఆ వేదిక మీదకి అందమైన అమ్మాయి చెంగుచెంగున వురుకుతూ వచ్చింది. వేదికని అనుకుని నిల్చుంది. గేలరీలో కూర్చున్న ప్రేక్షకులకి అభివాదం చేసింది.

నిండైన నవ్వుతో బలిష్ఠమైన శరీరంతో వొంకీల జుట్టుతో మోకాళ్ళపైకి బిగదీసిన గౌనుతో ఆమె అందంగా వుంది. అది మెరుపుతీగని మించిపోయిన అందం.

ప్రేక్షకులు రెప్ప వాల్చడం లేదు.

సరిగ్గా అప్పుడే ఎరీనాలోకి మరో వ్యక్తి అడుగుపెట్టాడు. చెయ్యెత్తు మనిషి. అతను వొత్తయిన కండలతో నిగనిగలాడుతున్నాడు. జుట్టు బారుగా భుజాల మీదకి వేలాడుతోంది.

అతను నైఫ్ బేలన్స్ ఫీట్ వేదికకి పదిహేను అడుగుల దూరంలో నిల్చున్నాడు.

అతని పక్కనే ఓ పళ్ళెం నిండా కత్తులున్నాయి. అవి పదును మెరుపుతో తళతళలాడుతున్నాయి.

ఈసారి ప్రేక్షకుల చూపు అతని వైపు తిరిగింది. ఆ తర్వాత అతని పక్కనే వున్న కత్తుల పళ్ళేరం మీదకి.

అతనూ ప్రేక్షకులకి అభివాదం చేశాడు. అనంతరం అందరికీ ఓ నల్లని రుమాలు చూపించి దాన్ని కళ్ళకి గంతలుగా కట్టుకున్నాడు.

విన్యాసం మొదలైందన్న సూచికగా సన్నటి విజిల్ వినిపించింది. క్షణంలో వెయ్యోవంతు సమయంలో అతను ఎలర్టయ్యాడు. పళ్ళెంలోని కత్తులు వొకటొకటే చేతిలోకి తీసుకుని వేదిక మీదకి బలంగా విసిరాడు.

రివ్వు రివ్వు మంటూ కత్తులు గాలిని చీల్చుకుపోతున్న చప్పుడు స్పష్టంగా వినిపించింది.

మొదటి కత్తి ఆమె తలకి రెండంగుళాల సమీపాన దిగబడింది. రెండోది ఆమె కుడి చెంపకి కాస్త పక్కన. మూడోది యెడమ చెంపకి కొంచెం యెడంగా. నాలుగోది ఆమె కుడి భుజానికి ఆవల. ఐదోది యెడమ భుజానికి యివతల. ఆరోది కుడి దండ మీదకి. ఏడోది యెడమ దండ మీదకి. మణికట్టు, చేతులు, నడుం వంపు, తొడలు, మోకాళ్ళు...

కత్తులన్నీ ఆమె చుట్టూ దిగబడ్డాయి.

ఆఖరి కత్తి విసిరేంత వరకూ ప్రేక్షకులు ఊపిరి తీసిన జాడ లేదు.

ఈవెంటు పూర్తయిన తర్వాత అదే చెరగని నవ్వు మొఖంతో ఆమె కత్తుల వలయం నుంచి బయటికి వచ్చింది.

అతను కళ్ళ గంతల్ని విప్పుకున్నాడు. అతనూ ఆమె చేతులు కలుపుకుని ప్రేక్షకులకి మరొక్కసారి అభివాదం చేసి అభినందనలు అందుకుంటూ వెళ్ళిపోయారు.

## 2

రాత్రి పన్నెండు గంటలు-

బిషన్‌సింగ్ మెత్తని అడుగులతో ఆ చివరి టెంటు దగ్గరకి చేరుకున్నాడు. దూరాన వెలుగుతున్న మెర్క్యూరీ దీపాల కాంతి టెంటుకి వొకవైపునే పడుతోంది. మరోవైపు అంతా చీకటి. అతను చీకట్లో నక్కినక్కి టెంటు డేరా చేరువ కొచ్చాడు.

"వూఁ... యింకా దగ్గరకి... యింకా యింకా"

లోపలినుంచి యిద్దరి గుసగుసలు. స్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఎగశ్వాసలు పెనవేసుకుపోతున్న సవ్వడి.

అది భరత్ వేసుకున్న టెంటు. లోపలి నుంచి వినిపిస్తున్నది కాళీ గొంతు.

బిషన్‌సింగ్ డేరాని కొంచెం తొలగించి చూశాడు.

భరత్ గుండెల మీదకి జారుతూ కాళీ.

షాక్ తిన్నట్టుగా అయి, బిషన్‌సింగ్ డేరాని వదిలిపెట్టాడు. ఒకే భంగిమలో నిలబడిపోయాడు చాలాసేపు.

గుసగుసలు యింకా వినబడుతూనే వున్నాయి.

"నువ్వు విసిరే కత్తులు గురితప్పి యిక్కడ గుచ్చుకుంటే"

"గుచ్చుకోవు. యెందుకంటే నా గురి నీమీంచి తప్పిపోదు"

కిలకిలమని జంటనవ్వులు. తెరలు తెరలుగా డేరా బయటికి చొచ్చుకొస్తూ నవ్వులు.

ఉండబట్టలేక, బిషన్‌సింగ్ మరోసారి లోపలికి తొంగి చూశాడు.

ఈసారి, కాళీ గుండెల మీదకి జారుతూ భరత్.

బిషన్‌సింగ్ వడివడిగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. టెంట్ల వరసని దాటుకుని సింహాలు, పులులు, ఏనుగుల విడిది స్థలాన్ని దాటుకుని నేరుగా కాశ్యప్ గదికి చేరుకున్నాడు.

బిషన్‌సింగ్ సర్కస్‌లో రింగ్ మాస్టర్.

కాశ్యప్ సర్కస్ కంపెనీ యజమాని.

కాశ్యప్‌ది ముప్పైరెండేళ్ళ పడుచు వయసు. అతని తండ్రి తర్వాత అదంతా అతని హయాంలోకి వచ్చింది.

సింహాలు, సింహాలతో చెలగాటమాడే అమ్మాయిలు, ఏనుగులు, ఏనుగులతో తొక్కించుకునే వస్తాదులు, యెందరెందరో విన్యాసకులు, మరుగుజ్జులు, బఫూన్లు, వాళ్ళ పిల్లలు- అతని లెక్కల్లో అదంతా తరగని ఆస్తి.

బిషన్‌సింగ్‌ని చూడగానే కాశ్యప్ "కాళి యెక్కడ" అని అడిగాడు.

"మీరన్నదే నిజం. అది భరత్ టెంటులో..."

కాశ్యప్ కళ్ళు యెర్రబడ్డాయి. ఆ కోపత పాలు తన మీద యెక్కడ ప్రదర్శిస్తాడో అన్నట్టుగా బిషన్‌సింగ్ బిర్రబిగుసుక పోయాడు.

ఎదురుగా టేబుల్ మీద సగం ఖాళీ అయిన విస్కీ బాటిల్, రెండు గ్లాసులు, ప్లేట్ నిండా చికెన్ రోస్ట్, కొన్ని బ్రెడ్ స్లైసులు.

గ్లాసులోకి విస్కీ వొంపీ సోడా కలపకుండానే బిషన్‌సింగ్‌కి అందించాడు కాశ్యప్. సోడా వొంపుకోడానికి బిషన్‌సింగ్ సాహసించలేదు. ఒక్క గుటకతో లార్జ్‌పెగ్ గొంతులోకి వొలుపుకున్నాడు. వేడివేడిగా జివ్వుమని మండింది గొంతు.

తర్వాత యిద్దరూ టెంటులోంచి ఆరుబైటకి నడిచేరు.

కాశ్యప్ తండ్రి హాయాం నుంచీ బిషన్‌సింగ్ అక్కడే పనిచేస్తున్నాడు. యాభయ్యేళ్ళ వయసు. యెర్రని రంగు. బట్టతల. అతని కుడిచేతికి రింగులుగా చుట్టుకుని యెప్పుడూ ఓ హంటర్. అతన్ని చూస్తే సింహాలు, సివంగులూ దీనంగా గర్జిస్తాయి.

సర్కస్‌లో అతని ఫీట్ కూడా సంచలనం కలిగించేదే!

సింహం నోట్లో తలపెట్టి పరమ విలాసంగా నవ్వుతాడు. అలాంటి బిషన్‌సింగ్ యిప్పుడు నడవలేక నడుస్తున్నట్లు కాశ్యప్‌ని అనుసరిస్తున్నాడు. టెన్షన్‌గా వున్నప్పుడు అతని అలవాటు- కుడిచేతికి వున్న హంటర్ కొసని యెడమ చేతితో పదేపదే తడమడం. ఇప్పుడు అతను అదే పని చేస్తున్నాడు.

"ఊ... అక్కడే దాని ప్రాణం తీసి రాకపోయావా"

ఆ మాటకి వులిక్కిపడి, "కాళీనా" అన్నాడు అప్రయత్నంగా.

కాశ్యప్ యెర్రని కళ్ళు బిషన్‌సింగ్ వైపు తిరిగాయి.

"అంత కంగారుపడ్డావ్, దాని మీద నీ కన్నూ వుందా"

"లేదు లేదు" అన్నాడు కంగారుగా. తర్వాత కాస్తంత తమాయించుకున్నాడు.

"మీ నాన్నగారితోనే నా వయసూ వెళ్ళిపోయింది"

తండ్రి ప్రస్తావన రాగానే కాశ్యప్ యింకేం మాట్లాడలేదు. ఇద్దరూ కొంతదూరం మాటల్లేకుండా నడిచారు. కాశ్యప్ అడుగులు మెల్ల మెల్లగా చివరి టెంటు వైపు పడుతున్నాయి. బిషన్‌సింగ్ అది గమనించి అతన్ని అడ్డుకున్నాడు.

"ఇప్పుడు మనం అటువైపు వెళ్ళొద్దు. నా మాట వినండి. రేపు నేను కాళీతో మాట్లాడతాను. చివరి ప్రయత్నం. మాట వినకపోతే అప్పుడు చూద్దాం దాని సంగతి"

"ఈ కంపెనీ నాది. దాని వల్లే ఇది నడుస్తుందనా అంత పొగరు"

కాళ్ళు కసిగా నేలకి తాటించి గిర్రున వెనక్కి తిరిగాడు కాశ్యప్.

## 3

ఉదయం టిఫిన్ల వేళ-

డైనింగ్ హాల్లో ఉత్తర దక్షిణాది మనుషుల కోలాహలం. ఉత్తర దక్షిణాది ఫలహారాలు. పరాచికాలు, కొంటె నవ్వులు, కోర చూపులు, చిరుకోపాలు, వెక్కిరింతలు, వేడివేడి సెగలు.

అదే మంచి సమయం అనుకుని బిషన్‌సింగ్ కాళీని సమీపించాడు.

"నీతో కొంచెం మాట్లాడాలి..."

"అంత రహస్యమా" అని నవ్వుతూ హాల్లోంచి బయటికొచ్చింది కాళీ.

కాశ్యప్ తరపున బిషన్‌సింగ్ రాయబారానికి రావడం యిది రెండోసారి. మొదటిసారి చెడతిట్టి పంపింది. ఆ దెబ్బతో చాలారోజులు ఆమె ముందు ముఖం దించుకున్నాడు. ఐనా సరే, యేది జరిగితే జరగనీ అన్నట్టు మళ్ళీ మొదటికొచ్చాడు.

గత రాత్రి వరకూ జరిగిందంతా కొంత కొంత చెప్పి "కాశ్యప్‌కి నువ్వంటే చచ్చేంత యిష్టం. అతన్ని అస్సలు నువ్వు పట్టించుకోవు" అని చివరి మాటని పూర్తిచేసి కుడిచేతి హంటర్ కొసని ఎడమ చేత్తో నలుపుతూ నిల్చున్నాడు.

"ఛీ! యింకా సిగ్గులేదు" అని తుపుక్కుమని ఊసింది కాళీ.

బిషన్‌సింగ్ తుళ్ళిపడి అటూయిటూ చూశాడు. దరిదాపుల్లో యెవరూ లేరు.

ఆమె యింకేం మాట్లాడకుండా కాశ్యప్ గదివైపు దూసుకుపోయింది. ఏం జరుగుద్దో తెలీకా అయోమయంగా, కంగారుగా బిషన్‌సింగ్ ఆమెని వెంబడించాడు.

ఆమె వేగంగా అతని గదిలోకి ప్రవేశించింది.

బిషన్‌సింగ్ గది బైటే నిలబడిపోయాడు.



"... నాకు యిష్టం లేదు. యిష్టం లేదని యెన్నోసార్లు చెప్పాను. ఒకసారి నాచేత బలవంతంగా తాగించి మోసగించావు. అయినా వూరుకున్నాను. యింక అంతే. అంతటితో వదిలిపెట్టు. వదిలిపెట్టు..."

ఆమె మాటల్తో పాటు గొంతులోని ఉద్రేకం కూడా పెరుగుతోంది.

వాటిని వినలేక బిషన్‌సింగ్ దూరానికి దూరానికి తప్పుకున్నాడు.

కొద్దిసేపటి తర్వాత కాళీ టెంటు బయటికి వచ్చి "ఛీ" అని తుపుక్కున వూసి తల తిప్పను కూడా తిప్పకుండా తన గదికి వెళ్ళిపోయింది.

మునుపొకసారి ఆమెని కాశ్యప్ బలవంతం చేసిన సంగతి బిషన్‌సింగ్‌కి యిప్పటిదాకా తెలియదు. ఏం చేయాలో అర్థంకాలేదు.

అతని వల్ల చాలామంది సర్కస్ కంపెనీని వదిలిపెట్టి వెళ్ళిపోవడం బిషన్‌సింగ్‌కి గుర్తొచ్చింది. చివరికి. 'యేదయితే అదయ్యిందిలే' అనుకుని మెల్లగా కాశ్యప్ గదిలోకి వెళ్ళాడు.

"ఎంతసేపయింది నువ్వొచ్చి" అన్నాడు కోపంగా కాశ్యప్. అసలే కోపగొట్టు మనిషి. ముఖం యెర్రగా కందిపోయి వుంది.

"ఇప్పుడే..."

"వెళ్ళు. వెళ్ళి భరత్‌ని పిల్చుకురా. వాడి దగ్గర నోరు మెదపకు" అని చెప్పి తక్షణమే అక్కడినుంచి బిషన్‌సింగ్‌ని పంపేశాడు.

ఆ రోజు రిహార్సల్స్‌లోనూ, ప్రదర్శనలోనూ సింహాలు బిషన్‌సింగ్ చేతిలో బాగా హంటర్ దెబ్బలు తిన్నాయి.

మొదట్లో కాళీ మీదకి కత్తి విసరాలంటే భరత్ తొట్రుపడేవాడు. ఆ బెదురుని కాళీ పోగొట్టగలిగింది. అతన్ని వుత్సాహపరిచింది. రెచ్చగొట్టింది. కోపగించింది. కొన్ని సార్లు చెడామడా తిట్టింది. స్పష్టంగా అతనికి గురి కుదిరేంత వరకూ ఆమె వదిలిపెట్టలేదు. అక్కడే ఆట. అక్కడే పాట. అక్కడే తొలి కావలింత



## 4

ఆ మర్నాటి నుంచి రెండురోజుల పాటు గ్రేట్ రేమండ్ సర్కస్‌లో నైఫ్ బేలన్స్ ఫీట్ ప్రదర్శించలేదు.

"నువ్వు నైఫ్ బేలన్స్ ఫీట్ చేస్తావు. అయితే, వేదిక మీద కాళీ బదులు సోనీ వుంటుంది" అన్నాడు కాశ్యప్.

భరత్‌కి ఏమీ బోధపడలేదు. ఎక్కడో యేదో తిరకాసుంది. సోనీ రోప్‌వాక్ చేసే అమ్మాయి. అయితే, వొడ్డూ పొడుగులో కాళీ మాదిరే వుంటుంది.

కాళీ యే విషయం భరత్‌కి చెప్పలేదు. ముభావంగా గదిలోనే వుండిపోయింది. ఆమెకి సర్కస్‌లో యే పనీ చెప్పకూడదని కాశ్యప్ ఆదేశం. ఆ ఆదేశం గురించి ఆమెకి, బిషన్‌సింగ్‌కి తప్ప యింకెవరికీ తెలీదు.

"ఈ ఫీట్ చేయడానికి కాళీ వుంటేనే మంచిది" అన్నాడు భరత్.

"కాళీ బదులు నేను నిల్చుంటాను. యెందుకు చేయలేవో చూస్తాను" అన్నాడు కాశ్యప్.

మరో మాటకి అవకాశం చిక్కలేదు.

గుడారాలకి దూరంగా ఖాళీస్థలంలో నైఫ్ బేలన్స్ ఫీట్ వేదికని యేర్పాటు చేశారు. వేదిక మీద కొత్త మనిషి- సోనీ. నిరాధారంగా తాడు మీంచి అలవోకగా నడిచే ఆ అమ్మాయి కాళ్ళల్లో కొంచెంగా వొణుకు. ఎప్పుడూ తొట్రుపడి యెరగని భరత్ చేతుల్లో వొణుకు.

కళ్ళకి గంతలు కట్టుకుంటే, యెదురుగా వేదిక మీది రూపాన్ని పోల్చుకోవడం సాధ్యంకావడం లేదు. ప్రయత్నిస్తున్నాడు. బెరుకు బెరుకుగా కత్తులు విసురుతున్నాడు. అవి రివ్వుమని దూసుకుపోతున్నాయి. వేదిక మీద దిగబడుతున్నాయి. అయితే, మునుపటిలా ఖచ్చితమైన స్థలాల్లో కాదు. కొంచెం అటూయిటుగా.

మాటిమాటికీ అతను గంతలు విప్పి చూడాల్సి వస్తోంది. పరిస్థితి మహా చిరాగ్గా అనిపిస్తోంది. టెంటులోంచి యిదంతా చూస్తున్న కాళీ కళ్ళలోకి కన్నీళ్ళు తన్నుకొస్తున్నాయి.

భరత్ ప్రాక్టీసు చేస్తున్న తీరుని కాశ్యప్ దూరంనుంచి గమనిస్తున్నాడు.

యథావిధిగా బిషన్‌సింగ్ పర్యవేక్షణ కొనసాగుతోంది. కుడిచేతి హంటర్ కొస యెడమ చేతిలో నలుగుతోంది పరపరా.

ఆ క్షణాన అతనికి తన తండ్రి గురుచరణ్ గుర్తొచ్చాడు.

అతను ఎప్పుడూ బిషన్‌సింగ్‌ని వొక మాట అడిగేవాడు.

"ఎవరెవరికి యేయే విద్యలు వచ్చునో గుర్తుపట్టేవా"

ఆ ప్రశ్న ఇన్నాళ్ళికి అర్థమయింది. కానీ యేం ప్రయోజనం?

భరత్ కత్తులు విసురుతున్నాడు. ఆగుతున్నాడు. చూస్తున్నాడు. చేతులు సర్దుకుంటున్నాడు. గొంతు తడుముకుంటున్నాడు. గంతలు విప్పి కళ్ళు తుడుచుకుంటున్నాడు. మళ్ళీ కట్టుకుంటున్నాడు. ఎదురుగా వేదిక మీద గురిని పోల్చుకోడానికి తంటాలుపడుతున్నాడు. చివరికి అసహాయంగా కూర్చుండిపోతున్నాడు. బిషన్‌సింగ్ హెచ్చరికతో మళ్ళీ ప్రాక్టీసు మొదలుపెడుతున్నాడు.

కత్తులు వొడుపుగా గాలిని చీల్చలేకపోతున్నాయి.

సర్కస్ కంపెనీలోకి చిన్నపిల్లగా కాళీ అడుగుపెట్టిన కొత్తల్లో అంతా నిండుగా వుండేది. చుట్టూ యెన్నెన్నో ప్రదర్శనలు. ఎందరెందరో మనుషులు. ఇప్పుడా వైభవం ఏదీ?

తొలినాళ్ళలో కాళీ చిన్నచిన్న విన్యాసాలే నేర్చింది. కానీ, అవేవీ నచ్చలేదు. కొన్నాళ్ళు పులులతో స్నేహంచేసి ఆటలాడించింది. భరత్ పులుల కేర్‌టేకర్‌గా వుండేవాడు. ఇద్దరికీ గాఢపరిచయం అక్కడే. భరత్ తండ్రి మెజీషియన్. ఆయన దగ్గరే భరత్ నైఫ్ బేలన్స్ ఫీట్ నేర్చుకున్నాడు. మొదట్లో వేదిక మీద బొమ్మని పెట్టి కత్తులు విసిరేవాడు. తర్వాత, ఆ బొమ్మకి బదులు కాళీయే వేదిక మీద నిలబడింది.

మొదట్లో కాళీ మీదకి కత్తి విసరాలంటే భరత్ తొట్రుపడేవాడు. ఆ బెదురుని కాళీ పోగొట్టగలిగింది. అతన్ని వుత్సాహపరిచింది. రెచ్చగొట్టింది. కోపగించింది. కొన్ని సార్లు చెడామడా తిట్టింది. స్పష్టంగా అతనికి గురి కుదిరేంత వరకూ ఆమె వదిలిపెట్టలేదు. అక్కడే ఆట. అక్కడే పాట. అక్కడే తొలి కావలింత.

గతంలోని వొక్కొక్క సంఘటనా గుర్తుచేసుకుంటూ కాళీ మనసంతా వుక్కిరిబిక్కిరి అయింది.

## 5

బాగా పొద్దుపోయింది. సర్కస్ మూడో ఆట ముగిసింది. ఎక్కడి వాళ్ళక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు.

చీకటి వెలుగుల్ని బద్దలుచేస్తూ పులులు, సింహాల అరుపులు వినిపిస్తున్నాయి.

కాళీకి నిద్రపట్టడం లేదు. పని లేకపోతే ప్రాణం ఆడుతున్నట్టే లేదు.

టెంటులో వుండబుద్ధికాలేదు. భరత్ టెంటు వైపు వెళ్ళింది. లోపల భరత్ లేడు. ఆ సమయంలో యెక్కడికీ వెళ్ళని మనిషి?

ఏదో జ్ఞాపకం లీలగా మెదిలీ ఆమె కళ్ళు యెరుపెక్కాయి.

వెతుకుతూ పోతే, భరత్ కాశ్యప్ గదిలో కనిపించాడు. బిషన్‌సింగ్ ఒక పక్కన నిలబడి వున్నాడు. భరత్ అదోరకంగా వున్నాడు. అతని చేతిలో విస్కీ గ్లాసు.



ఎదురుగా కాశ్యప్ కూర్చున్నాడు. యజమానిలాగా కాకుండా వినయంగా వుంది అతని వాలకం. కాశ్యప్ యేదో అడుగుతుంటే భరత్ తాగుతూ అడ్డంగా తలూపుతున్నాడు. అతను చెప్తున్నది బైటకి వినిపించటం లేదు.

ఒకానొకప్పుడు తనని కూడా అదే కుర్చీలో కూర్చోబెట్టి అభిమానం వొలికిస్తూ విస్కీ తాగించీ...

కాళీ వొక్క క్షణం కూడా ఆగలేదు. పరుగున వెళ్ళి భరత్ చెంప మీద చెళ్ళుమని కొట్టింది. ఆ దెబ్బకి చేతిలోని విస్కీగ్లాసు తుళ్ళిపోయింది.

అంతే వేగంగా అతని కాలర్ పుచ్చుకుని బరబరా బయటికి తీసుకుపోయింది.

భరత్ పెనుగులాడలేదు. ఆమె వెంటే వెళ్ళిపోయాడు.

అతన్ని నేరుగా నైఫ్ బేలన్స్ ఫీట్ వేదిక దగ్గరికి తీసుకువెళ్ళింది. ఆ సమయంలో మెర్క్యూరీ దీపాల కాంతి బాగా పల్చబడింది. అయినా సరే, కాళీ వూరుకోలేదు.

భరత్ కళ్ళకి గంతలి కట్టింది. అతని చేతికి కత్తిని అందించింది.

"ఊఁ... విసురు యిప్పుడు. నేరుగా నా మీదకి విసురు. నీకు గురి చేతరాపోతే నా గుండెల్లోకి విసురు" అన్నది. ఆమె మాటలు వుగ్రంగా వున్నాయి.

అంతే వేగంగా వెళ్ళి వేదిక మీద నిలబడింది.

భరత్ నోట మరో మాట లేదు. మత్తు మబ్బులా విడిపోతుంటే చీకటిని మరింత స్పష్టంగా చూడగలిగాడు. ఆ చీకట్లో ఓ వెలుగు జాడ కూడా. పోలిక పట్టగలిగాడు. అంతా కొద్దిసేపట్లోనే.

ఎంతో నిబ్బరంగా, సూటిగా వొకటొకటే కత్తులు విసిరేడు. గురి తప్పలేదు. చివరి కత్తి విసిరిన తర్వాత విజయగర్వంగా ఓ కేక వెలువడింది. అది కాళీదో భరత్‌దో యెవరూ గుర్తుపట్టలేరు.

కాళీ వేదిక మీంచి దూకుతూ, వచ్చి భరత్‌ని కావలించుకుంది. అతన్ని గాలిలో గిరగిరా తిప్పింది.

అప్పుడు వాళ్ళిద్దరి నుంచీ కెరట కెరటాలుగా ఓ చప్పుడు వినిపించింది. అయితే, ఆ చప్పుడు నవ్వో యేడుపుదో అర్థంకాలేదు కాశ్యప్‌కి. బిషన్‌సింగ్‌కి. వాళ్ళలా నివ్వెరపోయి చూస్తుండగా భరత్ కాళీలు వొకరి చేతులు వొకరు పట్టుకుని ఆ టెంటులన్నింటినీ దాటుకుని వెళ్ళిపోయారు. ●

అప్పుడు వాళ్ళిద్దరి నుంచీ కెరట కెరటాలుగా ఓ చప్పుడు వినిపించింది. అయితే, ఆ చప్పుడు నవ్వో యేడుపుదో అర్థంకాలేదు కాశ్యప్‌కి. బిషన్‌సింగ్‌కి

## స్వగతం

### సమాజసేవ ప్రతి ఒక్కరి బాధ్యత



కిరణ్‌కుమార్

సమాజసేవ చేయాలనే పట్టుదలతో విద్యార్థి దశ నుండే ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్‌గా చేరాను. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తోటి విద్యార్థులతో కలిసి రోడ్డు మరమ్మతులు చేయడం, మొక్కలు నాటడం, ఎయిడ్స్ వ్యాధి ప్రచారం, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. స్థానిక యువతీ యువకులతో కలిసి 'వివేకానంద యూత్ క్లబ్' ను ఏర్పాటు చేసి నేటి వరకు ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. ఒరిస్సా తుఫాన్ బాధితులకు క్లబ్ తరపున జిల్లా కలెక్టర్‌కు డి.డి.రూపంలో పదిహేనువందల పదహారు రూపాయలను, దుప్పట్లు, దుస్తులను అందజేశాను. గుజరాత్ భూకంప బాధితులకు సహాయంగా సూర్యసేవా సంఘం సహాయంతో ఉమ్మడిగా ఐదువేల ఐదువందల పదహారు రూపాయలను విరాళంగా సేకరించి డి.డి.రూపంలో జిల్లా ఎస్పీకి అందజేశాం. స్వచ్ఛందంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా 'బెస్ట్ యూత్ అవార్డు-2000' జిల్లా కలెక్టర్ నుండి, 'గ్రామీణ కళాజ్యోతి' అవార్డును శాసన సభ్యుల నుండి అందుకున్నాను. ప్రతి ఒక్కరూ తమ కనీస బాధ్యతగా సేవా భావాన్ని అలవర్చుకొని సేవాకార్యక్రమాలు చేపట్టాలని ఆశిస్తున్నాను.

- ఎ.కిరణ్‌కుమార్,
రాంనగర్, కరీంనగర్ జిల్లా

### ఆ ఇద్దరూ ఆపద్బాంధవులు!

మేం ఇద్దరం అన్నదమ్ములం, ఒక అక్క. నేను రెండవవాడిని. మాది ఒకప్పుడు గ్రామంలోనే నిరుపేద కుటుంబం. అమ్మా, నాన్న కూలిపని చేసి నన్నూ, తమ్ముడిని చదివించారు. అక్కమాత్రం చదువుకోలేదు. చదువుకోవడానికి మా ఇంట్లో కరెంటు కూడా ఉండేది కాదు. పదవ తరగతి చదివేటప్పుడు రాత్రిళ్ళు దీపం వద్దే చదివి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. మా అమ్మా, నాన్నకు చదివించే స్తోమత లేకున్నా మొదటి తరగతిలో పాసవడంతో కాలేజీ చదువు కూడా కొనసాగించమని చెప్పారు. అయితే నేను కాలేజీ చదువును నిర్లక్ష్యం చేశాను. ప్రేమ అంటూ ఒక అమ్మాయి వెంట తిరిగాను. ఫలితంగా ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయ్యాను. కానీ అమ్మా, నాన్న కష్టాలు చూస్తుంటే బాధ కలిగేది. ఒక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా జాయినై చదువు చెబుతూ నా చదువును కొనసాగించాను. మూడవసారికి ఇంటర్మీడియట్ పాసయ్యాను. అప్పుడే 2000 డి.యస్సీ నోటిఫికేషన్ వచ్చింది. నేను యస్.టి కావడంతో నాకు ఇంటర్‌తోనే డి.యస్సీ రాసే అవకాశం వచ్చింది. దీన్ని ఎలాగైనా వదులుకోవద్దనుకున్నాను. ప్రయత్నం చేస్తే ఫలితం నీవెంటే ఉంటుందని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. అలాగే రాత్రింబవళ్ళు కష్టపడ్డాను. పరీక్ష రేపు అన్న రోజు పద్దెనిమిది గంటలు చదివాను. తెల్లవారుజాము నాలుగ్గంటల వరకు చదివి. పొద్దునే పరీక్షరాయడానికి నిజామాబాద్‌కు బస్సులో వెళ్ళాను. కానీ బస్సు దిగగానే వాంతులయ్యాయి. నీరసం, లేవలేని పరిస్థితి. నాతో వచ్చిన మా ఊరివాళ్ళు ఇద్దరు- రమేష్‌గారు, మధుగారు- నాకు మంచి నీళ్ళు ఇచ్చి, టిఫిన్ చేయించి కాసేపు కూర్చోబెట్టి ఆదుకున్నారు.



రాజేందర్

ఎలాగో పరీక్ష రాయగలిగాను. ఫలితాల కోసం ఎదురుచూశాను. 'ఫలితాలు ఎలా వచ్చిన బాధపడొద్దు, నా ప్రయత్నం నేను చేశాను' అనుకున్నాను. ఫలితాలు వచ్చాయి. నేను పాసయ్యాను. దాంతో మా కష్టాలు తీరిపోయాయి. ఆనాడు నాకు సహాయం చేసిన రమేష్, మధులను ఎప్పటికీ మరవలేను.

- ఎమ్.రాజేందర్,
ముస్కాల్, నిజామాబాద్ జిల్లా

